అభివృద్ధి పనులు పూర్తి చేయాలని తీర్మానం

బాన్సువాడ, జూన్ 19 : బాన్సువాడ మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యుల సాధారణ సమావేశాన్ని చైర్మన్ గంగాధర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఎజెండా అంశాలను చదవి వినిపించారు. గత ప్రభుత్వం లో చేపట్టి, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలని తీర్మానించారు. ఈ నెల 25న బాన్సువాడలో నిర్వహించే వార సంతకు వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, కమీషనర్ శ్రీహరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పశువులను రోడ్లపైన వదిలితే కఠిన చర్యలు

కామారెడ్డి, జూన్ 19 : పట్టణంలో పశువుల యజమానులు తమ ఆవులు, గేదెలు ఇతర జంతువులను వీధుల్లో విడిచిపెడుతున్నారని, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సుజాత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రధాన వీధులు, రహదారులు అపరిశుభ్రం అవుతున్నాయని తెలిపారు. పాదచారులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ పశువులతో పారిశుద్ధ్య పనులకు తీవ్ర ఆటంకం కలుగుతున్నదని తెలిపారు. పశువులను యజమానులు తమ ఆధీనంలో ఉంచుకోవాలని, లేదంటే 2019 చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాలువల్లో పూడిక మట్టి తొలగింపు

బోర్లం క్యాంపు గ్రామంలో పంట కాలువలో పూడిక తీస్తున్న ఉపాధి కూలీలు

బాన్సువాడ రూరల్, జూన్ 19 : రైతులు సాగు చేసే పంటలకు సజావుగా సాగునీరు అందేందుకు ఉపాధి హామీ పథకంలో భాగంగా కాలువ పూడికతీత పనులు చేపడుతున్నారు. బాన్సువాడ మండలంలోని బోర్లం, దేశాయిపేట్, కొల్లూరు, నాగారం, ఇబ్రహీంపేట్ గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో భాగంగా పంట పొలాలకు వెళ్లే కాలువలో పూడికతీత పనులు చేపడుతున్నారు. కాలువల్లో పెరిగిన పిచ్చి మొక్కల తొలగింపుతోపాటు పూడిక మట్టిని తీసివేస్తున్నారు. పూడికతీయడంతో రైతులకు పుష్కలంగా సాగునీరు అందనుంది. వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో కాలువపూడిక పనులు చేపడుతున్నామని ఏపీవో గంగాధర్ తెలిపారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

కామారెడ్డి, జూన్ 19 : జిల్లా కేంద్రంలోని యోగా భవన్‌లో ఈ నెల 21వ తేదీన 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మనాయక్, పతంజలి యోగా సమితి నిర్వాహకుడు రాంరెడ్డి సంయుక్తంగా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ ఆఫీస్ నిజామాబాద్ ఆధ్వర్యంలో కామారెడ్డి యోగా భవనంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలలో భాగంగా యజ్ఞంతో మొదలై యోగి విశిష్టత, ఆసనాలతో కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యేపాటు జిల్లా అధికారులు, యోగా గురువులు హాజరవుతారని, ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని విజయవంత చేయాలని కోరారు.

పంట రుణాల మంజూరులో ఉదారంగా వ్యవహరించాలి

- కలెక్టర్ అశీష్ సంగ్వాన్
- అధికారులు, బ్యాంకర్లకు కలెక్టర్ సూచన

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అశీష్ సంగ్వాన్

కామారెడ్డి, జూన్ 19 : రైతులకు పంట రుణాలను అందించడంలో ఉదారంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ బ్యాంకర్లకు సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో రైతులకు రుణాల పంపిణీ, స్వయం సహాయక సంఘాల అధికారులతో రుణాలు, రికవరీ, పీఎంజీవై, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల పథకాలకు సంబంధించి రుణ లక్ష్య పురోగతిపై బ్యాంకర్ల సమన్వయ కమిటీ జిల్లా స్థాయి సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పబ్లిక్, ప్రైవేట్ సెక్టార్ బ్యాంకర్లు వివిధ పథకాల కింద యూనిట్ల గ్రౌండింగ్ నిమిత్తం తమకు వచ్చిన దరఖాస్తులను త్వరిగతిన పరిశీలించి పరిష్కరించాలన్నారు. బ్యాంకుల వారీగా ప్రగతిని సమీక్షిస్తూ గత ఆర్థిక సంవత్సరంలో పంట రుణాలు, టర్మ్ లోన్స్, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, విద్య, గృహ నిర్మాణం తదితర రంగాలకు రూ.5,569 కోట్లు అందించాలని లక్ష్యంకాగా 78.60 శాతం సాధించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకనైనా శాఖల అధికారాలు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేస్తూ వంద శాతం లక్ష్యాలను సాధించాలన్నారు. 2016-17 నుంచి 2021-22 వరకు ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ మంజూరై పెండింగ్‌లో ఉన్న యూనిట్లను కాలయాపన చేయకుండా త్వరగా గ్రౌండింగ్ చేయాలన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డు పథకం కింద పాడి రైతులు, గొర్రెల పెంపకం దారులకు ఎలాంటి మార్టిగేజ్ లేకుండా రుణాలు మంజూరు చేయాలన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నారీశక్తి కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ పథకం కింద ఎటువంటి ప్రాసెసింగ్ చార్జీలు లేకుండా రెండు కోట్ల వరకు వివిధ వ్యాపారాలకు రుణాలు అందిస్తున్నదని తెలిపారు. మహిళలు ఈ అవకావాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నారీశక్తి ఎస్టీపీ కింద ఎలాంటి సెక్యూరిటీ లేకుండా రూ.2 నుంచి రూ.10 లక్షల వరకు రుణం అందిస్తున్నదన్నారు. ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్స్ సమర్పించడంతో లోన్ పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ రెహమాన్, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ శ్రీనివాస్, కెనారా బ్యాంక్ డీఎంలు, డీసీసీబీ జనరల్ మేనేజర్ ఫణి సాయిరాం, యూనియన్ బ్యాంక్ ఆర్ఎం వికాస్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, అధికారులు చందర్, శ్రీధర్, లాలూ నాయక్, సింహారావు, భాగ్యలక్ష్మి, అంబాజీ, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌ను కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ

కామారెడ్డి/దోమకొండ, జూన్ 19 : కామారెడ్డి జిల్లా కలెక్టర్‌గా వచ్చిన అశీష్ సంగ్వాన్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, వైస్ చైర్మన్ ఉరుదొండ వనిత బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకెను అందజేశారు. తాగునీరు, డ్రైనేజీ సమస్య, రోడ్ల నిర్మాణం గురించి చర్చించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పాత కృష్ణమూర్తి, చాట్ల వంశీ తదితరులు పాల్గొన్నారు. దోమకొండ జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్ కలెక్టర్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కామారెడ్డి రూరల్, జూన్ 19 : కామారెడ్డి మండలం దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగమ్మ చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించిందని ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. దేవునిపల్లిలోని గంగమ్మ చెరువులో వ్యక్తి మృతదేహం ఉందని సమాచారం వచ్చిందన్నారు. వెంటనే అక్కడి వెళ్లి చూడగా మృతుడు జీన్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, చెప్పులు, షర్ట్ ఒడ్డున ఉన్నాయన్నారు. ఈ నెల 12 తేదీనాటి ఈఎన్‌టీ ప్రభుత్వ దవాఖాన ఓపీ స్లిప్ ఉందని, అందులో యాదగిరి అని పేరు ఉందన్నారు. ఇంటి పేరు, మిగతా వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై తెలిపారు.

ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా రోహిత్

కామారెడ్డి, జూన్ 19 : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్‌గా రోహిత్ ఎంపికయ్యాడు. ఈ నెల 15, 16, 17వ తేదీల్లో వరంగల్‌లో నిర్వహించిన ఏబీవీపీ ప్రాంత అభ్యాస వర్గలో నూతన కామారెడ్డి జిల్లా కన్వీనర్‌గా రోహిత్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం విద్యారంగ సమస్యలపై పోరాడుతానని, ఒక విద్యార్థి పరిషత్ కార్యకర్తగా జాతీయ పునర్నిర్మాణంలో తాను భాగమవుతానని అన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించినందుకు ఏబీవీపీ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం

నస్రుల్లాబాద్, జూన్ 19 : బీర్కూర్‌కు చెందిన సురేఖ(30), కుమారుడు అభిలాష్(10), ఆరాధ్య(02) ముగ్గురు అదృశ్యమైనట్లు బుధవారం పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీర్కూర్ గ్రామానికి చెందిన సురేఖ ఈ నెల 16న కిరాణ దుకాణానికి వెళ్లి వస్తానని భర్త మైషబోయికి చెప్పి ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయిందన్నారు. బంధువుల ఇంట్లో, చుట్టు పక్కల వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించండి

మాట్లాడుతున్న డీఎస్పీ నాగేశ్వర్‌రావు

దోమకొండ, జూన్ 19 : డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి సారించాలని డీఎస్పీ నాగేశ్వర్‌రావు అన్నారు. దోమకొండ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో డివిజన్ స్థాయి సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న కేసుల గురించి వివరాలు తెలుసుకొని పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి సారించాలని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలో ఉన్న సీఐలు, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'నిధులు విడుదల చేయించండి'

వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

నస్రుల్లాబాద్, జూన్ 19 : గ్రామ పంచాయతీల్లో సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవో నీలావతి, ఎంపీవో రాముకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు బుధవారం వినతిపత్రం అందజేశారు. సర్పంచుల పదవీ కాలం ముగిసి ప్రత్యేక అధికారుల పాలన వచ్చి ఐదు నెలలు గడుస్తున్నదని అన్నారు. కానీ గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నుంచి నిధులు రాలేదన్నారు. పంచాయతీల్లో పని చేసే సిబ్బందికి వేతనాలు, విద్యుత్ చార్జీలు, ట్రాక్టర్ నిర్వహణ, పారిశుద్ధ్య, తాగునీటి సరఫరా, మోటార్లు, పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు పనులు చేయడానికి నిధులు లేవన్నారు. పంచాయతీ నిధులు వచ్చేలా పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శులు పాల్త్య రవి, ముఖీద్, నవీన్, మాన స, రజిత తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

రాజంపేట్, జూన్ 19 : మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మండల పరిషత్ సభ్యులు అధికారులకు సూచించారు. మండలం కేంద్రంలోని రైతు వేదికలో మండల పరిషత్ అధ్యక్షురాలు స్వరూప అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు పలు అంశాలపై చర్చించారు. రాజంపేట లోని న్యూ బీసీ కాలనీలో తాగునీటి సమస్య ఉందని, మిషన్ భగీరథనీరు అందించాలని కోఆప్షన్ సభ్యుడు సభ దృష్టికి తీసుకురావడంతో రెండు రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. తలమడ్లలో రైల్వే బ్రిడ్జి వద్ద పైపులైన్లు రోడ్డుకు అడ్డంగా ఉన్నాయని రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎంపీటీసీ రాజు తెలుపగా రైల్వే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని మిషన్ భగీరథ ఏఈ వినోద్‌కుమార్ వివరణ ఇచ్చారు. ఆర్గొండ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సమస్య, సిబ్బంది కొరత ఉందని ఎన్ని సార్లు సభ దృష్టికి తీసుకువచ్చినా.. అధికారులు స్పందించడం లేదని ఆర్గొండ ఎంపీటీసీ సాగర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటు పుస్తకాలు పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలని పొందుర్తి ఎంపీటీసీ బాల్‌రాజగౌడ్ అన్నారు. కోళ్లఫారాల యజమాన్యాల నిర్లక్ష్యంతో తలమడ్ల, ఆరెపల్లి గ్రామాల్లో ఈగల బెడద ఉందని, సంబంధిత యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సభ తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపుతామని ఎంపీడీవో రాజేశం తెలిపారు. వైస్ ఎంపీపీ సావిత్రి, జడ్పీటీసీ కొండా హన్మాండ్లు తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీవో రాజేశం, ఎంపీవో రఘురాం, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

లింగంపేట, జూన్19: మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం 19 సంవత్సరాలలోపు వారికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు మండల వైద్యాధికారిణి హిమబిందు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 12,600మందికి మాత్రలను పంపిణీ చేయడం లక్ష్యంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. వైద్యసిబ్బందితోపాటు అంగన్‌వాడి, ఆశ కార్యకర్తలు మాత్రల పంపిణీలో పాల్గొంటారని వివరించారు.

రేపు ఎల్లారెడ్డిలో యోగా డే

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 19: ఎల్లారెడ్డి పట్టణంలో 21న శుక్రవారం యోగా డే నిర్వహించనున్నట్లు యోగాచార్యుడు నాగరాజ్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని బాలాగౌడ్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఉదయం 6 గంటలకు ఆరోగ్య సూత్రా లు, ప్రాణాయామం, యోగాసనాలు, యోగాలో మెళకువలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమానికి పట్టణప్రజలు, మహిళలు, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 19: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి బాధితుడికి బుధవారం అందజేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డికి చెందిన జక్కుల యాదగిరి నెలన్నర క్రితం తన ఫోన్ ను అడ్విలింగాల్ గ్రామం వద్ద పోగొట్టుకున్నాడు. పూర్తి వివరాలతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు వివరాలను సీఈఐఆర్‌లో నమోదు చేసి రికవరీ చేశారు. సెల్‌ఫోన్‌ను బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సెల్‌ఫోన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను జాగ్రత్తగా ఉంచుకోవాలని, ఫోన్ పోగొట్టుకుంటే వివరాలతో రికవరీ చేయడం సాధ్యమవుతుందని తెలిపారు. బాధితులు పూర్తి వివరాలతో వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

కళాశాలకు చేరిన పాఠ్యపుస్తకాలు

నాగిరెడ్డిపేట, జూన్ 19: ఇంటర్ బోర్డు నుంచి నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీకి బుధవారం పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయి. మొత్తం 3,796పుస్తకాలు వచ్చాయని లెక్చరర్ నాగయ్య తెలిపారు. వాటిని త్వరలో విద్యార్థులందరికీ అందజేస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులు పోషకాహారాన్ని తీసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సత్యనారాయణ

గాంధారి, జూన్ 19: విద్యార్థులు రక్తహీనతకు గురికాకుండా ఉండాలంటే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని డాక్టర్ సత్యనారాయణ అన్నారు. సికిల్‌సెల్ ఎనీమియా ఎలిమినేషన్ (రక్తహీనత నిర్మూలన) కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. సికిల్ సెల్ ఎనీమియా అనేది వంశానుగత రక్త రుగ్మత అని తెలిపారు. సాధారణంగా ఎర్ర రక్తకణాలు గుండ్రని ఆకారంలో ఉంటాయని తెలిపారు. ఈ వ్యాధి ఉన్న వారిలో మాత్రం అవి సికిల్(కొడవలి) ఆకారంలో ఉంటాయని తెలిపారు. దీంతో భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. విద్యార్థులు రక్తహీనత నిర్మూలన కోసం పోషకాహారం తీసుకోవడంతోపాటు నీటిని ఎక్కువగా తాగాలని, పండ్లు తినాలని సూచించారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీడీవో అంబాజీ, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. సోమ్లా, ఎస్టీ హాస్టల్ వార్డెన్ నవీన్ కుమార్, ఎంపీటీసీ తూర్పు రాజులు తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సహకరించాలని వినతి

ఎంపీపీ వినీత, జడ్పీటీసీ మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న సిబ్బంది, కార్యదర్శులు

నాగిరెడ్డిపేట, జూన్ 19: మండలాభివృద్ధికి సహకరించాలని పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది.. ఎంపీపీ వినీతను కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆమెను కలిసి ఘనంగా సన్మానించారు. ఎంపీపీగా మహిళ ఎన్నిక కావడం సంతోషంగా ఉందన్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీపీ అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మనోహర్ రెడ్డి, ఎంపీడీవో పర్బన్న తదితరులు పాల్గొన్నారు.

నత్త నడకన అభివృద్ధి పనులు

- అసంపూర్తిగా అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మరమ్మతు పనులు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

టికారాం తండాలో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్డి నిర్మాణం

తండాలో కొనసాగుతున్న కుళాయిల నిర్మాణం

పెద్దకొడప్‌గల్, జూన్ 18: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలని సర్కారు నిర్ణయించింది. కేసీఆర్ ప్రభుత్వం పాఠశాలల బలోపేతం కోసం 'మన ఊరు - మన బడి' కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో అభివృద్ధి పనులు చేపడుతున్నది. ఇందులో భాగంగా మండలంలోని 33 బడులను అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపికచేసింది. వాటిలో భవనాల మరమ్మతులు, మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం తదితర పనులు చేపట్టేందుకు నిధులను విడుదల చేసింది. పాఠశాలల పునః ప్రారంభం జూన్ 12వ తేదీ వరకు పనులు పూర్తి చేయాలని ఆదేశాలు సైతం జారీచేసింది. కానీ అధికారుల నిర్లక్ష్యంతో పనులు ఇప్పటివరకు పూర్తికాలేదు. పాఠశాలలు ప్రారంభమై వారం రోజులు గడిచినా.. ఇంకా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. అసంపూర్తి పనులతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పనులను త్వరగా పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

బిచ్కుందలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డి/ డోంగ్లీ/ బిచ్కుంద/ నాగిరెడ్డిపేట, జూన్ 19: దవాఖానల్లోని రోగులకు కాంగ్రెస్ నాయకులు బుధవారం పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎల్లారెడ్డి, డోంగ్లీ, బిచ్కుంద, నాగిరెడ్డిపేట మండల కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో కేక్ కట్ చేయడంతోపాటు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహానికి పాలాభిషేకం

కార్యక్రమంలో పాల్గొన్న బజరంగ్‌దళ్ నేతలు

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 19: హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని బజరంగ్‌దళ్ కార్యకర్తలు బుధవారం ఎల్లారెడ్డి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీచౌక్‌లో ఉన్న శివాజీ మహారాజ్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. బజరంగ్‌దళ్ నాయకుడు వినోద్ కుమార్ మాట్లాడుతూ.. హిందూ సమాజ శ్రేయస్సు కోసం శివాజీ మహరాజ్ చేపట్టిన కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకొని ప్రతిఒక్కరూ హిందూ ధర్మాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ నాయకులు తులసీదాస్, రాహుల్, అఖిల్, చరణ్, శశి, భరత్, వసంత్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

విద్యాబోధనపై అంగన్‌వాడీలకు శిక్షణ

విద్యాబోధనపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో

మద్నూర్, జూన్ 19: విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో మండలకేంద్రంలోని సీడీపీవో కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు విద్యాబోధనపై బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీడీపీవో సునంద అంగన్‌వాడీల్లో చిన్నారులకు ఎలా బోధించాలి అనే విషయమై పలు సూచనలు చేశారు. చిన్నారులకు నిత్యం పోషకాహారం అందజేయాలన్నారు. చిన్నారులను కేంద్రాలకు తీసుకువచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

కుంటలో పడి వ్యక్తి మృతి



సాయిలు(ఫైల్)

పెద్దకొడప్‌గల్, జూన్ 19: కాలు జారి కుంటలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకొడప్‌గల్‌కు చెందిన అలిగె సాయిలు(30) కాలకృత్యాలు తీర్చుకునేందుకు బుధవారం ఉదయం స్థానిక మాలకుంటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి కుంటలో పడిపోయాడు. ఊబిలో చిక్కుకొని ఊపిరాడకపోవడంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కుంటలో నుంచి బయటికి తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా దవాఖానకు తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కోనారెడ్డి తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పీజీ ఎంట్రెన్స్‌లో 95వ ర్యాంకు

లింగంపేట, జూన్ 19: మండలంలోని మెంగారం గ్రామానికి చెందిన ఊరడి ఉమేశ్ చంద్రయాదవ్ తెలంగాణ పీజీ కామన్ ఎంట్రెన్స్‌లో రాష్ట్ర స్థాయిలో 95వ ర్యాంకు సాధించాడు. ఉమేశ్ చంద్రయాదవ్ ఘట్‌కేసర్‌లోని ఏస్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్‌లో ఈఈఈ పూర్తి చేశాడు. వారం రోజుల క్రితం నిర్వహించిన పీజీ ఈ-సెట్ పరీక్షకు హాజరయ్యాడు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో 95వ ర్యాంకు సాధించడంపై కాలేజీ యాజమాన్యంతోపాటు గ్రామస్తులు అభినందించారు. మండలంలోని పోల్కంపేట గ్రామానికి చెందిన చామారం వివేకానంద రాష్ట్ర స్థాయిలో 220వ ర్యాంకు సాధించారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు సన్మానం

నాగిరెడ్డిపేట, జూన్ 19: మండలంలోని బొల్లారం ఉన్నత పాఠశాలలో బుధవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులను జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి సన్మానించారు. బదిలీపై వెళ్తున్న నరేశ్‌రెడ్డితోపాటు ఇక్కడికి బదిలీపై వచ్చిన సుకుమార్‌గౌడ్‌కు పూలమాల వేసి శాలువాలు కప్పి సత్కరించారు. సురేశ్‌రెడ్డి అందించిన సేవలను కొనియాడారు. అంతకుముందు ఆయన పాఠశాలలో చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు రాచప్ప, పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
EDUCATION
★ రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed., B.Ed., B.P.Ed., MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. *4 నెలల్లో పరీక్షలు. 8866977112, 339.
NT-333727

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.